జాతీయ వార్తను
ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.
కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..

జాతీయ వార్త తెలుగు దినపత్రిక

మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రిక ద్వారా ప్రచురించి మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761

epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

గురువారం | 2-10-2025 | శ్రీకాకుళం | సంపుటి: 2 సంచిక: 472 పేజీలు: 4 వెల : రూ.7

# నేడు దసరా

*** కిటకిటలాడిన మార్కెట్ * ఆకాశాన్నంటిన కొబ్బరి, అరటి పండ్లు, పూల ధరలు * రద్దీగా రైల్వేస్టేషన్లు, బస్టాండ్‌లు**

**శ్రీకాకుళం, అక్టోబరు1(వార్త):** విజయదశమి పండుగ వచ్చిందంటే చాలు జిల్లాలో ఒకటే కోలాహలం. జిల్లావ్యాప్తంగా మండపాలను ఏర్పాటు చేసి అమ్మవారిని ప్రతిష్టించి పూజలు చేస్తున్నారు. దుర్గ ఆలయాల్లో శరన్నవరాత్రిని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు నిర్వహిస్తున్నారు. అమ్మవారిని తొమ్మిది రోజులు పాటు వివిధ రూపాల్లో అలంకరించారు. గురువారం దసరా సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. దసరా పూజ చేసేందుకు అవసరమైన సామగ్రిని కొనుగోలుకు వెళ్లిన వారితో మార్కెట్ కిటకిటలాడింది. కొబ్బరి, అరటి పండ్లు ఆకాశాన్నంటాయి. ఒక్కో కొబ్బరి రూ.40 నుంచి రూ.50లు, అరటి పండ్లు డజన్ రూ.50 వరకూ ధర పలికింది. పూలు, పండ్లు కూడా ఆకాశాన్నంటాయి. శ్రీకాకుళం పాతబస్టాండ్, రైతుబజార్ రద్దీగా మారింది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారితో రైల్వేస్టేషన్లు, బస్టాండ్లు కిటకిటలాడాయి. వాహనాలు కడిగే షాపుల వద్ద ప్రజలు బారులు దీరారు.

## ఏదయా మీదయా మామీద లేదా?

**సంతబొమ్మాళి, అక్టోబరు1 (వార్త):** దసరా ఉత్సవాలలో భాగంగా కొల్లిపాడు ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు అలనాటి జ్ఞాపకాలను గుర్తు చేశారు. సహ ఉపాధ్యాయుడు విభూతి కుమారస్వామి సరస్వతీ పూజలు నిర్వహించిన అనంతరం పాఠశాల విద్యార్థులతో దసరా బాణములతో ఏదయా.. మీ దయా, సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు వంటి గీతాలను లయబద్ధంగా ఆలాపన చేసి గ్రామంలో ఇంటింటికి వెళ్లి ఆశీస్సులు తీసుకున్నారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు అలనాటి జ్ఞాపకాలను నెమరు వేసుకుంటూ సంతోషం వ్యక్తపరిచారు. కనుమరుగవుతున్న సాంప్రదాయాలను వెలికి తీసి పునరావృతం చేయడంలో ఉపాధ్యాయుని కృషి, అంకితభావానికి విద్య కమిటీ చైర్మన్, గ్రామ పెద్దలు కొనియాడారు.





'జాతీయ వార్త' దినపత్రిక పాఠకులకు, ప్రకటన కర్తలకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు, ప్రజాప్రతినిధులకు.. విజయ దశమి శుభాకాంక్షలు.
- ఎడిటర్

# చోరీ కేసులో.. హిజ్రా అరెస్టు

*** పరారీలో నలుగురు * 12 తులాల బంగారం స్వాధీనం * కాశీబుగ్గ డీఎస్పీ లక్ష్మణరావు**

**పలాస, అక్టోబరు1 (వార్త):** పలు చోరీలకు పాల్పడిన కవిటి గ్రామానికి చెందిన నాగుల సోని అలియాస్ నాగుల సమంతో బెహరా అనే హిజ్రాను అరెస్టు చేసి 12 తులాల బంగారం, 55 గ్రాముల బెండిని స్వాధీనం చేసుకున్నామని కాశీ బుగ్గ డీఎస్పీ డి.లక్ష్మణరావు తెలిపారు. కాశీబుగ్గ డీఎస్పీ కార్యాలయంలో బుధవారం మీడియా సమావేశం నిర్వహించి దొంగతనాలకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. కంచిలి గ్రామానికి చెందిన రిటైర్డ్ లెక్చరర్ పురి సింహాద్రి ప్రదానో కుటుంభీకులతో కలిసి జూలై నెల 5వ తేదీన విశాఖపట్నం వెళ్లారు. తిరిగి ఆరో తేదీ రాత్రి ఇంటికి రాగా ఇంటి తాళాలు పగలకొట్టి ఉండడాన్ని గమనించారు. ఇంటిలో వస్తువులను పరిశీలించగా 25 తులాల బంగారం, కేజి వెండి ఆభరణాలు చోరీకి గురయినట్లు గుర్తించి 8న కంచిలి పోలీసులకు ఫిర్యాదు చేశారు. సోంపేట రైల్వే స్టేషన్ నుంచి కంచిలి రైల్వే స్టేషన్ వైపు చేతి సంచితో వస్తున్న హిజ్రాను సొంపేట సీఐ మంగరాజుతో పాటు పోలీసులు పట్టుకొని తమదైన శైలిలో విచారించారు. మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, రాజస్థాన్ రాష్ట్రాలకు చెందిన బాబు, కబాడియా, సనాటా, టున్ని అనే వ్యక్తులు బూరలు అమ్మడానికి ఈ ప్రాంతానికి రావడంతో వారితో పరిచయం ఏర్పడిందని, వారితో కలిసి జూలై 5వ తేదిన కంచిలిలో తాళం వేసి ఉన్న ఇంటిలో చోరీకి పాల్పడ్డామన్నారు. ఆ చోరీలో తన వాటాగా వచ్చిన బంగారం, వెండిని బరంపురం తీసుకువెళ్లి విక్రయించేందుకు బయలుదేరాసని హిజ్రా చెప్పాడన్నారు. హిజ్రా నుంచి బంగారం, వెండి స్వాధీనం చేసుకొని అరెస్టు చేయడం జరిగిందని డీఎస్పీ తెలిపారు. ఈ చోరీ కేసులు మరో నలుగురు పరారీలో ఉన్నారని, త్వరలో వారిని పట్టుకుని మిగిలిన బంగారం కూడా స్వాధీనం చేసుకుంటామన్నారు. మూడు నెలలోనే ఈ కేసును ఛేదించిన సీఐ మంగరాజు, కంచిలి ఎన్ఐ. పారినాయుడుతో పాటు ప్రతిభ చూపిన హెడ్ కానిస్టేబుల్స్, కానిస్టేబుల్స్‌కు జిల్లా ఎస్పీ ద్వారా రివార్డులు అందించడానికి కృషి చేస్తానని డీఎస్పీ తెలిపారు.



### రోడ్డు ప్రమాదంలో
# రైల్వే అధికారి శ్రీధర్ మృతి



**మందస, అక్టోబరు 1(వార్త):** రోడ్డు ప్రమాదంలో ఓ రైల్వే అధికారి మరణించారు. చిన్న వయస్సులో రైల్వేశాఖలో ఉద్యోగం సాధించి, అధికారిగా ఎదిగిన ఆ విద్యావేత్త మరణంతో ఆయన స్వగ్రామంలో విషాదఛాయలు అలము కున్నాయి. వివరాల్లోకి వెళితే.. మందస మండలంలోని గోపాలపురం గ్రామానికి చెందిన టెంక శ్రీధర్ సామాన్య కుటుంబానికి చెందినవారు. ఎంతో కష్టపడి చదవుతూ రైల్వేలో ఉద్యోగం సాధించారు. అంచెలంచెలుగా ఎదుగుతూ అధికారి స్థాయికి చేరుకున్నారు. ఆయన శ్రమ, పట్టుదల, కృషి, ఎదుగుతున్న తీరు చూసి విధికి కన్నుకుట్టినట్లయింది. విజయవాడలో జరిగిన రోడ్డు ప్రమాదంలో శ్రీధర్‌ను అందని లోకాలకు తీసుకెళ్లిపోయింది. విజయవాడలో ఉద్యోగం చేస్తున్న శ్రీధర్ ద్విచక్రవాహనంపై బంధువులకు చెందిన ఓ ఫంక్షన్ కు వెళ్లి వస్తుండగా.. ఈ ప్రమాదం జరిగింది. ఆయన తీవ్రంగా గాయపడ్డారు. మూడు రోజుల పాటు విజయవాడలో ఓ ఆసుపత్రి చికిత్స పొందుతూ శ్రీధర్ మరణించారు. శ్రీధర్ తల్లిదండ్రులు ఢిల్లేశ్వరరావు, కుమారి దంపతులకు ఒక్కడే కుమారుడు. సామాన్య, పేద కుటుంబానికి చెందిన శ్రీధర్ ఉద్యోగంతో ఆ కుటుంబం ఆర్థికంగా స్థిరపడుతోంది. ఈ తరుణంలో హటాత్తుగా శ్రీధర్ మరణించడంతో ఆ కుటుంబం కన్నీరుమున్నీరుగా విలపిస్తోంది. మృతునికి భార్య సంధ్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతదేహం గురువారం గోపాలపురం చేరుకుంటుందని కుటుంబీకులు చెప్పారు. ఎంతో మంచి వ్యక్తిగా గుర్తింపు ఉన్న శ్రీధర్ మృతితో గోపాలపురంలో విషాదఛాయలు అలముకున్నాయి.

## డివైడర్ను ఢీకొన్న స్కూటీ.. వ్యక్తి మృతి

**నరసన్నపేట/జలుమూరు, అక్టోబరు 1 (వార్త):** నరసన్నపేట జాతీయ రహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. పోలీసులు అందించిన వివరాల ప్రకారం.. విశాఖలో సీమెన్‌గా పనిచేస్తున్న రవి(28) సొంత ఊరు వజ్రపుకొత్తూరుకు స్కూటీపై వస్తుండగా అదుపు తప్పి డివైడర్ను ఢీకొట్టాడు. దీంతో ఆ యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. ఎస్సై సీహెచ్ దుర్గాప్రసాద్ కేసు నమోదు చేశారు.



# ఆదిత్యునికి కిరణస్పర్శ

*** అరసవల్లి సూర్యనారాయణ స్వామి సన్నిధిలో అపురూప దృశ్యం * తిలకించి పులకించిన భక్తులు * ఆదిత్యాయ నమో నమ: అంటూ భక్తుల నామస్మరణ**

**అరసవల్లి, అక్టోబరు1 (వార్త):** ఆరోగ్యప్రదాత సూర్యనారాయణ స్వామి ఆలయంలో అపురూప దృశ్యం ఆవిష్కృతమైంది. బుధవారం ఉదయం ఆరు గంటల సమయంలో భానుడి లేలేత కిరణాలు స్వామి వారికి తాకాయి. సూర్య కిరణాలు ఆలయ ముఖద్వారం మీదుగా పయనించి, అనివెట్టి మండపం నుంచి నేరుగా గర్భాలయంలోని స్వామివారి పాదాలు, ఆపై స్వామివారిని పూర్తిగా కిరణాలు స్పృషించాయి. దీన్ని తిలకించిన భక్తులు నమో సూర్యనారాయణ నామస్మరణతో ఆలయం మార్మోగింది. గురువారం కూడా స్వామివారిని ఆదిత్యుని కిరణాలు తాకనున్నాయని ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ, ఈవో కేఎన్‌వీడీవీ ప్రసాద్ తెలిపారు.

జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## పేరుకే బంగారం.. కాటేసిందా మరణం

**మందస, అక్టోబరు 1(వార్త):** ఈ పాము పేరు బంగారు పాము(బాండెడ్ క్రెయిట్).. కట్లపాము అని పిలుస్తారు. ఎంతో అందంగా కనిపించే ఈ పాము అత్యంత విషపూరితమైనది. అరుదుగా కనిపించే ఈ పాము నాగుపాము కంటే కూడా ప్రమాదకరమైనదని చెబుతారు. ఎక్కడ నుంచి వచ్చిందో.. ఎలా వచ్చిందో కానీ.. మందస మండలంలోని హరిపురం-మందస రోడ్డులో గుర్తు తెలియని వాహనం కింద పడి మరణించింది. ఇదే రహదారిలో ప్రయాణిస్తున్న యువకులు తమ సెల్ఫోన్లలో పామును ఫోటో తీసి, సామాజిక మాధ్యమాల్లో పెట్టారు. వాస్తవానికి గ్రామాల్లో చిన్న చిన్న కట్లపాములు కనిపిస్తుంటాయి. కానీ, రంగురంగుల కట్లపాము కనిపించడం అరుదుగా జరుగుతుందని స్థానికులు పేర్కొంటున్నారు.



# ప్రభాకర్ పట్నాయక్ సేవలు చిరస్మరణీయం



**మందస, అక్టోబరు 1(వార్త):** ఉపాధ్యాయునిగా 28ఏళ్లకు పైగా సర్వీసుని పూర్తి చేసి అటు పాఠశాలల అభివృద్ధికి, విద్యార్థులు అభ్యున్నతికి నిరంతరం కృషి చేసిన ఉపాధ్యాయుడు ప్రభాకర్ పట్నాయక్ అని ఏపీటీయఫ్ మందస నాయకులు అన్నారు. ఉద్యోగ విరమణ పురస్కరించుకొని ఏపీటీయఫ్ నాయకులు, ఇతర ఉపాధ్యాయులు ఆయన ఇంటికి వెళ్లి ఉద్యోగ విరమణ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆయన పని చేసిన ప్రతీ పాఠశాలలో విద్యార్థులకు బోధించిన తీరు, ఆయా పాఠశాలల పరిధి ప్రజలతో మమేకమై పాఠశాలను అభివృద్ధి పథంలో నడిపించిన విధానాన్ని గుర్తు చేసుకున్నారు. ప్రస్తుతం మందస పట్టణ అభివృద్ధి కమిటీ, స్థానిక మందస ఉన్నత పాఠశాల అభివృద్ధి కమిటీలో కీలకంగా వ్యవహరిస్తూ, ఏపీటీయఫ్ చేపడుతున్న వివిధ కార్యక్రమాల్లో కూడా చురుకుగా పనిచేస్తూ తనదైన ముద్ర వేశారని అన్నారు. కార్యక్రమంలో ఆయనతో ఉన్న అనుభవాలను ఏపీటీయఫ్ నాయకులు, ఉపాధ్యాయులు పంచుకున్నారు. అనంతరం ప్రభాకర్ పట్నాయిక్మా మాట్లాడుతూ ఏపీటీయఫ్ సంఘం పనితీరు, భవిష్యత్ లో ఉపాధ్యాయులు ఎలా ముందుకుపోవాలనే విషయాలను తెలిపారు. ఆయనకి శుభాకాంక్షలు తెలిపిన వారిలో ఏపీటీయఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు గవ్వ భీమారావు, మండల ప్రధాన కార్యదర్శి కర్రి సుందరరావు, సీనియర్ ఉపాధ్యాయులు పి.మల్లికార్జునరావు, పి.కృష్ణారావు, ఇతర ఏపీటీయఫ్ కార్యవర్గ సభ్యులైన డి.వైకుంఠ రావు, సింహాచలపతి, బి.మురళీమోహన్, యస్.గణేశ్వరరావు, డి.చంద్రశేఖర్, బి.రామారావు తదితరులు ఉన్నారు.



## ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించండి

**మందస, అక్టోబరు 1(వార్త):** ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలును ప్రతీ పల్లెకు వెళ్లి సమావేశాలు పెట్టి అవగాహన కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వ ఉద్యోగులు అందరిపై ఉందని వెలుగు ఐటీడీఏ అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్ పైడి కూర్మారావు అన్నారు. మందస పట్టణంలోని మండల సమాఖ్య కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన సిబ్బంది సమీక్షా సమావేశంలో పాల్గొని మాట్లాడారు. పంచ సూత్రాలు పాటిస్తున్న మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులకు ఆదాయాభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి ఎంటర్ ప్రైనర్లుగా ఎదగ దానికి కావలసిన ఆర్థిక, సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రభుత్వం అందిస్తున్నట్లు వివరించారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రకృతి వ్యవసాయానికి సంబంధించిన శిక్షణలు, పశు పోషణ, డైరీ, పాడి పరిశ్రమ అభివృద్ధికి ఆవుల, గేదెల పెంపకం, కోళ్ల పెంపకం, గొర్రె పిల్లలు పెంపకం, చేపల పెంపకం, పశుదాణా తయారీ యూనిట్లు, మునగ, బొప్పాయి, జామ, డ్రాగన్ ఫ్రూట్స్ అభివృద్ధికై హార్టికల్చర్ లో సబ్సిడీపై షేడ్ నెట్లు ఏర్పాటు తదితర అంశాలపై పల్లెపల్లెలో సమావేశాలు నిర్వహించాలని సిబ్బందిని ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వం వస్తు సేవలపై పన్నులను తగ్గించినందున సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ పై ఇంటింటికి అర్థమైనట్లు వివరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో లీగల్ కోఆర్డినేటర్ తారకమోహన్, డేటా ఎంట్రీ ఆపరేటర్ రాజారావుతో పాటు, క్లస్టర్ కోఆర్డినేటర్లు ముఖలింగం, మంగమ్మ, బాలకృష్ణ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## జీఎస్టీపై రైతులకు అవగాహన

**కోటబొమ్మాళి, అక్టోబర్1 (వార్త):** స్థానిక సచివాలయంలో సూపర్ జీఎస్టీపై మండల అభివృద్ది అధికారి కె. ఫణీంద్రకుమార్, వ్యవసాయాధికారి ఎస్. గోవిందరావులు బుధవారం రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రాక్టర్ ర్యాలీ నిర్వహించారు. కూటమి ప్రభుత్వం వ్యవసాయ యాంత్రీకరణపై 18 శాతం ఉన్న జీఎస్టీని 5 శాతానికి తగ్గించిందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



## వెంకటరావు మాస్టారుకు సన్మానం



**వీరఘట్టం, అక్టోబరు 1 (వార్త):** ఎస్సీ ఎస్టీ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శిగా వీరఘట్టానికి చెందిన అన్ను వెంకటరావు మాస్టారు ఎన్నికైన సందర్భంగా ఆయన్ను ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ బుధవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. మండల, జిల్లా స్థాయి నుంచి రాష్ట్రస్థాయికి ఎదిగినందుకు ఈ ప్రాంతానికే గర్వకారణం అని ఎమ్మెల్యే కొనియాడారు. ఇటు విద్యార్థులను బావి భారత పౌరులుగా తీర్చిదిద్దడమే కాకుండా అటు ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరిస్తూ ఉద్యోగ ఉపాధ్యాయ ,హక్కుల కోసం నిరంతరం శ్రమిస్తున్నారని ఆయన అన్నారు. ఈయనను ఆదర్శంగా తీసుకొని ఉపాధ్యాయ వర్గాలు ముందుకు సాగాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు.

### ఉపాధ్యాయులకు మహాత్మాగాంధీ
## సాహితీ కళా పురస్కారాలు

**కోటబొమ్మాళి, అక్టోబరు1(వార్త):** కోటబొమ్మాళికి చెందిన ఐదుగురు ఉపాధ్యాయులకు మహాత్మాగాంధీ సాహితీ కళా పురస్కారాలు లభించాయి. గాంధీ జయంతిని పురస్కరించుకుని శ్రీశ్రీ కళావేదిక శ్రీకాకుళం జిల్లా శాఖ ఆధ్వర్యంలో శ్రీకాకుళం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో బుధవారం నిర్వహించిన కవితోత్సవ సమ్మేళనం కార్యక్రమంలో వీరు ఈ పురస్కారాలు అందుకున్నారు. జాతిపిత మహాత్మాగాంధీ ఆశయాలు, త్యాగాలు, దేశభక్తిని చాటిచెప్పే కవితలతో జరిగిన కవి సమ్మేళనంలో స్థానిక జెడ్పి ఉన్నత పాఠశాలలో కళా విద్య ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న గేదెల పాపారావు ఓ మహాత్మా.. మళ్లీ జన్మించినా..! అనే శీర్షికతో రాసిన కవిత ఆలపించి పెద్దల నుంచి ప్రశంసలు పొందారు. అలాగే తెలుగు ఉపాధ్యాయులు గొర్లె శ్రీనివాసరావు, లోపింటి రజితేంద్ర రెడ్డి, కె.కుసుమ, శ్రీపావని లు రాసిన కవితలు, కూన భాస్కరరావు ఆలపించిన గేయం సభికులను ఆకట్టుకున్నాయి. శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ ఛైర్మన్ కత్తిమండ ప్రతాప్ కుమార్, జాతీయ అధ్యక్షులు ఈశ్వరి భూషణం, మీడియా ప్రతినిధి ఎస్.అమ్మూ బమ్మిడిల నిర్దేశాల మేరకు శ్రీకాకుళం జిల్లాశాఖ ఈ కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ సందర్భంగా వీరిని శ్రీశ్రీ కళావేదిక ఉత్తరాంధ్రశాఖ అధ్యక్షులు డబ్బీరు గోవిందరావు, శ్రీకాకుళం జిల్లా శాఖ కన్వీనర్ బోగెల ఉమామహేశ్వరరావు, జిల్లా శాఖ అధ్యక్షులు మణిపాత్రుని నాగేశ్వరరావు, తెలుగు రచయితల వేదిక అధ్యక్షులు ఉత్తరావిల్లి నాగేశ్వరరావు, తెరవే ప్రధాన కార్యదర్శి ఆర్.వి.రమణమూర్తి, టి.లింగరాజులు కిరీటం, శాలువాతో పాటు ప్రశంసాపత్రం, పుష్పగుచ్ఛాలతో పురస్కారాలు ప్రదానం చేసి సత్కరించారు.






## హెచ్ఐవిపై అవగాహన అవసరం

**ఇచ్ఛాపురం, అక్టోబరు1(వార్త):** స్థానిక ప్రభుత్వ సామాజిక ఆసుపత్రిలో వైసీబీ ట్రక్కర్ ప్రాజెక్ట్ ఆధ్వర్యం లో స్టాల్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా హెచ్ ఐ వి ఎయిడ్స్ వ్యాధులపై అవగాహనా కల్పించారు. సుఖ వ్యాధులు రాకుండా తీసుకోవలసిన జాగ్రత్తలు వివరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ దేవేంద్రరెడ్డి, సనపల అనూష, తురక శిల్ప, రమేష్ నాయుడు, కౌన్సెలర్ రాజశేఖర్, మోహన్, వెంకట రాజు, హెల్త్ ఎడ్యుకేటర్స్ ఎన్ని రవి, హాసన్, రాజేష్, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

## వైభవంగా శారదా దేవీ ఉత్సవాలు



**ఇచ్ఛాపురం, అక్టోబరు1(వార్త):** మండలం తేలుకుంచి గ్రామంలో శారదా దేవీ పంచరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. దేవి నవరాత్రుల సందర్భంగా పదివ రోజు సరస్వతీ దేవి అవతారంలో తులసిగాం వైదేహి మాత అమ్మవారు దర్శనమిచ్చారు. కుంకుమ పూజలు ఘనంగా నిర్వహించారు. గ్రామ దేవత స్వేచ్ఛావతి అమ్మవారి ఆలయంలో ఈ ఏడాది రెండు రోజుల పాటు సిద్ధి ధాత్రి అవతారంలో భక్తులకు దర్శనం ఇవ్వడం విశేషం. ఈ ఏడాది నవమి రెండు రోజులు ఏర్పడింది. అనంతరం పూర్ణాహుతి వైభవంగా నిర్వహించారు.

## ఆకట్టుకున్న సంగీత విభావరి




**ఇచ్ఛాపురం, అక్టోబరు1(వార్త):** స్వేచ్ఛావతి అమ్మవారి ఆలయ ప్రాంగణంలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా కమిటీ ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమంలో మహతి సాంస్కృతిక కళా సేవా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన సంగీత విభావరి కార్యక్రమం ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో మహతి సాంస్కృతిక కళాసేవ సంస్థ సభ్యురాలు జీవిత గాత్రంపై అలరించగా, కీబోర్డుపై టీ బరంపురం గ్రామానికి చెందిన ప్రముఖ జానపద సంగీత కళాకారులు, తిప్పన ధనుంజయ రెడ్డి, కపాషకుద్దీ గ్రామానికి చెందిన ప్రముఖ మృదంగ విద్వాంసులు,చలపరాయి వినోద్ కుమార్ సంగీత బృందం ప్రేక్షకులను ఎంతో ఆకట్టుకుంది. అనంతరం కళాకారులకు కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు.

## కళాకారులకు సన్మానం



**ఇచ్ఛాపురం, అక్టోబరు1(వార్త):** డబ్బూరి వీధి దక్షిణ కాళీ మాత ఆలయంలో గాన సేవ బృందానికి సత్కారం చేశారు. గత మూడేళ్లగా ఉచితంగా గాన సేవ చేస్తున్న పడాల పార్వతీశం, కృష్ణారావు, గిలాయి తిరుపతిరావు, డిల్లీరావు సేథీ, లావణ్యలను సన్మానించారు. ఈ కార్యక్రమంలో దక్షిణ కాళీ ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు. విశ్వహిందూ పరిషత్ సభ్యులు పాల్గొన్నారు.

## నేడు మాంసం విక్రయించొద్దు

**పలాస, అక్టోబరు1(వార్త):** గాంధీ జయంతి సందర్భంగా గురువారం పలాస కాశీబుగ్గ పురపాలక సంఘంలో ఎటువంటి మాంసవిక్రయాలు జరగకుండా చూడాలని అన్ని సచివాలయాల శానిటేషన్ కార్య దర్శులకు, సంబంధిత శాఖా సిబ్బందికి పలాస కమిషనర్ ఎన్.రామారావు ఆదేశించారు. అన్ని రకముల మాంసం విక్రయాల షాపుల యజమానులకు, చేపలు అమ్మేవారికి చెప్పాలని తెలిపారు. ఈ విషయంలో ఎటువంటి అలసత్వం వహించిన సిబ్బందిపై తగుచర్యలు తీసుకుంటామని కమిషనర్ హెచ్చరించారు.

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## తిరుమల బ్రహ్మోత్సవాల్లో ఆకట్టుకున్న కోలాట ప్రదర్శన



**నరసన్నపేట/జలుమూరు, అక్టోబరు1 (వార్త):** తిరుమలలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల సందర్భంగా నరసన్నపేట సత్యనారాయణ స్వామి కోలాట బృందం ఆధ్వర్యంలో తిరుమల హనుమంతు వాహన సేవలో నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలలో కోలాట ప్రదర్శన ఇచ్చారు. ప్రతి ఏటా బ్రహ్మోత్సవాల సందర్భంగా తాము కోలాటం ప్రదర్శన ఇస్తున్నామన్నారు.



## సంతబొమ్మాళిలో 'డిజిటల్ బుక్' ఆవిష్కరణ

**సంతబొమ్మాళి, అక్టోబరు1(వార్త):** అన్యాయానికి గురైనటువంటి కార్యకర్తలకు అండగా నిలిచేందుకు వైయస్సార్ సీపీ ఏర్పాటు చేసిన డిజిటల్ బుక్‌ను ఆ పార్టీ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ కెల్లి జగన్నాయకులు (గోవింద్) బుధవారం సంతబొమ్మాళిలో ఆవిష్కరించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ లపై ప్రశ్నించే వైసీపీ నాయకులను వేధిస్తున్నారన్నారు. ప్రస్తుతం రాష్టంలో రెడ్ బుక్ పాలన నడుస్తుందన్నారు. ఇలా అన్యాయానికి గురైన ప్రతి నాయకుడు, కార్యకర్తలకు వైసీపీ అధిష్టానం అండగా ఉంటుందని తెలిపారు. ఇందుకోసం పార్టీ అధినేత జగన్మోహన్ రెడ్డి ఆదేశాలు మేరకు డిజిటల్ బుక్‌ను ఏర్పాటు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి మండల పార్టీ అధ్యక్షుడు బుడ్డా మోహన్ రెడ్డి, మూలపేట, పాలతలగం ఎంపీటీసీ ప్రతినిధి అట్టాడ అప్పలనాయుడు, టెక్కలి నియోజకవర్గం విద్యార్థి విభాగం అధ్యక్షుడు నక్కిట్ల నరేష్, సంతబొమ్మాళి మాజీ ఎంపీటీసీ సభ్యులు కొన్న శ్రీరాములు, కళింగపట్నం నాగరాజు, మల్ల రాజు, రేయ్యి ఆనంద్, సంతబొమ్మాళి వార్డ్ మెంబర్ గాయత్రీ మల్లేష్, జి వెంకటరావు, అట్టాడ మోహన్, రాము, నారం జగన్నాధం వైసీపీ ముఖ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

## నరసన్నపేటలో ఉచితంగా ముఖ, దవడ శస్త్ర చికిత్సలు

**నరసన్నపేట/జలుమూరు, అక్టోబరు1 (వార్త):** నరసన్నపేట ఏరియా హాస్పిటల్లో ముఖ, దవడ శస్త్రచికిత్సలు ఉచితంగా చేపడుతున్నామని ఓరల్ దంత వైద్య నిపుణులు రమేష్ నాయుడు తెలిపారు. బుధవారం స్థానిక హాస్పిటల్లో ఆయన మాట్లాడుతూ.. ఇటీవల కాలంలో ముఖ దవడ చికిత్సలతో పాటు దవడ కణితలు నివారణకు సంబంధించి శస్త్ర చికిత్సలు చేపడుతున్నామన్నారు. వీటిని సంబంధిత వ్యాధిగ్రస్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. సోమ, బుధ, శుక్రవారాల్లో అందుబాటులో ఉంటామని రమేష్ నాయుడు తెలిపారు.

## జీఎస్టీ వినియోగంపై అవగాహన ర్యాలీ




**నరసన్నపేట/జలుమూరు, అక్టోబరు1 (వార్త):** కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ పన్నులను తగ్గిస్తూ తీసుకున్న నిర్ణయం పట్ల ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నామని తహసీల్దార్ సత్యనారాయణ, ఎంపీడీవో విజయానంద్ తెలిపారు. బుధవారం నరసన్నపేట ఎంపీడీవో కార్యాలయం నుంచి బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. నిత్యావసర, కిరాణా సామాగ్రి వంటి తదితర సరుకులపై జీరో నుంచి అయిదు శాతం జీఎస్టీ మాత్రమే విధించడం జరిగిందన్నారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## ఉపాధ్యాయ అభ్యర్థులకు 3 నుంచి శిక్షణ

**శ్రీకాకుళం, అక్టోబరు 1(వార్త):** డీఎస్సీ 2025 ద్వారా ఎంపికైన ఉపాధ్యాయ అభ్యర్థులకు ఈనెల 3 నుంచి శిక్షణా తరగతులు నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి ఎ.రవిబాబు తెలిపారు. శిక్షణ కార్యక్రమం 10వ తేదీ వరకు కొనసాగుతుందని, అభ్యర్థులు ఉదయం 7 గంటలకు సంబంధిత శిక్షణా కేంద్రాలలో రిపోర్టు చేయాలని ఆయన స్పష్టం చేశారు. తెలుగు, హిందీ, ఒరియా, ఇంగ్లీష్ ఉపాధ్యాయ అభ్యర్థులు గ్లోబల్ జూనియర్ కాలేజీలో, బయోలాజికల్ సైన్స్, మ్యాథమెటిక్స్ అభ్యర్థులు ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో, ఫిజికల్ ఎడ్యుకేషన్, సోషల్ స్టడీస్ అభ్యర్థులకు శ్రీ మహాలక్ష్మి నిలయంలో శిక్షణ ఇస్తామన్నారు. ఫిజికల్ సైన్స్, అలాగే ఎస్జిటి అభ్యర్థులు విశ్వ విజేత జూనియర్ కాలేజీకి హాజరుకావాలని సూచించారు.

## పలాసలో కేంద్రీయ విద్యాలయానికి గ్రీన్ సిగ్నల్

* ఫలించిన కేంద్ర మంత్రి రామ్మోహన్, ఎమ్మెల్యే గౌతు శిరీష కృషి

**పలాస,అక్టోబరు1 (వార్త):** విజయదశమి శుభ సందర్భంలో శ్రీకాకుళం జిల్లా ప్రజలకు మరో చారిత్రాత్మక శుభవార్త అందింది. పలాసలో కేంద్రీయ విద్యాలయ స్థాపనకు కేంద్ర ప్రభుత్వం అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసి, నిధులు మంజూరు చేసింది. విద్యాలయం మంజూరుకు విశేష కృషి చేసిన కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు, పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష ఎన్నో ఏళ్ల కల నేడు సాకారమైందని పలాస ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు. శ్రీకాకుళం జిల్లా పలాసతో పాటు రాష్ట్రంలోని గుంటూరు, చిత్తూరు, కుప్పం ప్రాంతాల్లో మొత్తం నాలుగు కేంద్రీయ విద్యాలయాలు ఏర్పాటు కానున్నాయి. మొత్తం 5836 కోట్ల రూపాయల నిధులతో దేశవ్యాప్తంగా 57 కేంద్రీయ విద్యాలయాలను ఏర్పాటు చేస్తోంది ఎన్డీఏ ప్రభుత్వం. అందులో నాలుగు విద్యాలయాలు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి దక్కడం డబుల్ ఇంజన్ ప్రభుత్వానికి గౌరవం లభించినట్టయింది. కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు, పలాస ఎమ్మెల్యే గౌతు శిరీషలకు పలువురు అభినందనలు తెలిపారు.

# పేదోడికి వైద్యం దూరం చేసే కుట్ర

* వైయస్సార్సీపి జిల్లా అధికార ప్రతినిధి బమ్మిడి దుర్యోధన



**పలాస, అక్టోబరు1(వార్త):** పేదలకు వైద్య, విద్య, ప్రజలకు మెరుగైన వైద్యం దూరం చేస్తూ కార్పొరేటర్లకు మేలు చేకూర్చడం కోసమే కూటమి ప్రభుత్వం ప్రభుత్వ వైద్య కళాశాలలను పీపీపీ విధానంలోకి తీసుకొచ్చిందని వైయస్సార్సీపి జిల్లా అధికార ప్రతినిధి బమ్మిడి దుర్యోధనరావు ఆందోళన వ్యక్తం చేశారు. బుధవారం ఆయన పలాసలో మీడియాతో మాట్లాడుతూ విద్య, వైద్యం అనేది అంబేద్కర్ రాసిన రాజ్యాంగంలోని ప్రాథమిక హక్కు అయినప్పటికీ, పేదలు, బడుగు, బలహీన వర్గాలకు వైద్యవిద్యను దూరం చేసేందుకు కూటమి ప్రభుత్వం కుట్ర పన్నుతోందన్నారు. రాష్ట్రంలో ప్రతి పేదోడికి కార్పొరేట్ వైద్యం అందించాలని తలంపుతో డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి ఆరోగ్యశ్రీ తీసుకువచ్చి ఎంతోమందికి ఉచితంగా కార్పొరేట్ వైద్యం అందించారని ఆయన గుర్తు చేశారు. వైయస్ జగన్మోహన్ రెడ్డి మరో అడుగు ముందుకు వేసి రాష్ట్రంలో 17 మెడికల్ కళాశాలల నిర్మాణానికి అనుమతి తెలియజేయడంతో పాటు నిధులు సమకూర్చడం జరిగిందన్నారు. ఐదు మెడికల్ కళాశాలల నిర్మాణాలు పూర్తికాగా రెండు కళాశాలలలో తరగతులు ప్రారంభించుకునే దశలో ఉందన్నారు. మిగిలిన కళాశాలలు కూడా 50 శాతం నుంచి 80 శాతం పనులు పూర్తి చేసుకున్న దశలో ఉండగా కూటమి సర్కార్ కుట్రకు పూనుకుందన్నారు. వైద్యాన్ని కార్పొరేట్ శక్తుల చేతిలో పెట్టేందుకు ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యంతో మెడికల్ కళాశాలల నిర్మాణం చేపట్టాలని నిర్ణయించిందన్నారు. ఈ విధానంతో పేదలకు వైద్యం అందుకుండా చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆయన ఆరోపించారు. నాడు వైఎస్ఆర్సిపి ప్రభుత్వంలో దేశ చరిత్రలోనే ఎన్నడూ లేని విధంగా రాష్ట్రానికి 17 ప్రభుత్వ మెడికల్ కాలేజీలు తీసుకురావడమే కాక, తమ రాష్ట్ర విద్యార్థులకు ఎక్కువ సీట్లు కేటాయించాలని నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి కేంద్రానికి కోరారని, కూటమి ప్రభుత్వం వచ్చాక మెడికల్ కాలేజీలు తాము నిర్వహించలేమంటూ కేంద్రానికి లేఖ రాసిన ఏకైక ప్రభుత్వం ప్రస్తుత కూటమి ప్రభుత్వమేనని ఆయన దుయ్యబట్టారు. ఒక్కో కళాశాల లో 15 శాతం సీటు కేంద్రం భర్తీ చేస్తే తక్కిన 85 శాతం సీట్లను రాష్ట్ర ప్రభుత్వం భర్తీ చేస్తుందన్నారు. ఎస్సీ, ఎస్టి, బీసీ, మైనార్టీ విద్యార్థులు ఉచితంగా వైద్య విద్య చదివే వీలుండేది అన్నారు. అలాంటిది రాష్ట్రంలో ఉన్న మెడికల్ కాలేజీ లన్ని ప్రైవేట్ పరం చేస్తే పేద విద్యార్థులకు వైద్య విద్య అందని ద్రాక్ష లా మారుతుందని బమ్మిడి దుర్యోధనరావు ఆందోళన వ్యక్తం చేశారు. పీ పీ పీ విధానం మాటున ప్రభుత్వం మెడికల్ కాలేజీలను ప్రైవేట్ కు అప్పగించడం అన్యాయం అన్నారు. రాష్ట్రంలో పేద విద్యార్థులు వైద్య విద్య చదువుకోకూడదా? అని బమ్మిడి దుర్యోధనరావు ప్రశ్నించారు. ప్రైవేట్ గా మెడికల్ సీటు పొందాలంటే రూ.80 లక్షల దాకా ఖర్చు చేయవలసి ఉంటుందని, పేద వర్గాలకు ఇది సాధ్యమేనా అని ఆయన వాపోయారు. పేదలను వంచిస్తున్న కూటమి ప్రభుత్వానికి ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని ఆయన హెచ్చరించారు.

## పిల్లల్లో పొదుపు చేసే అలవాటు నేర్పించాలి



**పలాస, అక్టోబరు1 (వార్త):** విద్యార్థి దశ నుంచే పిల్లల్లో పొదుపు చేసే అలవాటు నేర్పించాలని రామకృష్ణాపురం విద్యా విహార్ ట్రస్ట్ చైర్మన్ మల్ల రమేష్ అన్నారు. సత్యసాయి బాబా తన అవతార దివ్య సందేశాలలో ఎల్లప్పుడూ ముఖ్యంగా అందరిని సేవించు-అందరిని ప్రేమించు అని చెబుతూ, ప్రతీవారు వారి వారి రోజువారీ ఖర్చులు తగ్గించుకొని తద్వారా పొదుపు చేసిన మొత్తంతో సమాజానికి సేవలు చేయమని సందేశాన్ని ఇచ్చారన్నారు. రామకృష్ణాపురము శ్రీ సత్యసాయి విద్యావిహార్ విద్యార్థులు గత 10 సంవత్సరాల నుంచి వాళ్ళ వాళ్ళ పాకెట్ మనీలో కొంత మిగుల్చుకొంటూ, తద్వారా మిగిలిన మొత్తంతో ప్రతీనెల 1వ తారీఖున నారాయణసేవ చేస్తున్నారన్నానరు. దాంట్లో భాగంగా బుధవారం గవర్నమెంట్ ఆసుపత్రి ఉన్న ఇన్ పేషెంట్‌కు, ఆహార ప్రసాదం స్వామివారి విభూతి, స్వామివారి చిత్రపటాన్ని నారాయణసేవా ఇంఛార్చ్ దాలేటి, విద్యార్థులు అందజేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మన్ మల్లా రామేశ్వరరావు మాట్లాడుతూ పిల్లల్లో చిన్ననాటి నుండి పొదుపు చేయుట, సేవ చేయుటలో ఉన్న ఆనందాన్ని అందించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని తెలియజేశారు. ప్రిన్సిపాల్ ప్రీతి చౌదరి మాట్లాడుతూ విద్యార్థికి చదువుతో పాటుగా సామాజిక బాధ్యత గుర్చి గుర్తు చేయడంలో భాగమే ఈ కార్యక్రమమన్నారు.

## ఇంటర్ స్టేట్ క్రికెట్ టోర్నీ విజేత ఇచ్చాపురం

**పలాస, అక్టోబరు1(వార్త):** పలాస రైల్వే గ్రౌండ్ లో అండర్ 12 క్రికెట్ టోర్నమెంట్ గత కొన్ని రోజులుగా జేబీసీసి, గ్రీన్ ఆర్మీ, రైల్వే శ్రామిక కాంగ్రెస్ యూనియన్, ఇతర సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించారు. దీనిలో ఆంధ్ర, ఒరిస్సా క్రికెట్ 10 వివిధ జట్లు తలపడగా ఫైనల్‌లో ఇచ్చాపురం వర్సెస్ పలాస మ్యాచ్ జరిగింది. మొదట బ్యాటింగ్ చేసిన పలాస నిర్ణీత 20 ఓవర్లలో 98 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ చేసిన ఇచ్చాపురం 16 ఓవర్లో రెండు వికెట్ల కోల్పోయి మ్యాచ్ విజేతగా నిలిచింది. బెస్ట్ బౌలర్ సాత్విక్, బెస్ట్ బ్యాట్స్మెన్ డిస్సాజ్, మెన్ అఫ్ ది మ్యాచ్ దక్షిత్, మ్యాన్ ఆఫ్ ది సిరీస్ నికల సాయిలు కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి డాక్టర్ కూన పవన్ కుమార్ మాట్లాడుతూ ఆటలు మానసిక శారీరక ఆరోగ్యాన్నిస్తాయని తెలియజేశారు. క్రీడాకారులు క్రమశిక్షణ ఆటపైన శ్రద్ధ పెట్టి కోచ్, తల్లిదండ్రుల సూచించిన విషయాలు శ్రద్ధగా పాటించాలని తద్వారా మీరు ఆశించిన ఫలితాలు సాధిస్తారని తెలియజేశారు. ఏఐసి సెలక్షన్ కమిటీ మెంబర్ కె.కిరణ్ జనరల్ సెక్రెటరీ నగిరి బెనర్జీ మాట్లాడుతూ పలాసలో క్రికెట్ ప్రోత్సాహం బాగా ఉందని తెలియజేస్తూ ఇకపైన క్రికెట్ సంబంధించిన ఏ విధమైన సహాయ సహకారాలు కావలసిన జిల్లా క్రికెట్ సంఘము నుండి అందిస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రీన్ ఆర్మీ అధ్యక్షులు బోనేల గోపాల్, రైల్వే శ్రామిక కాంగ్రెస్ యూనియన్ పలాస అధ్యక్షులు పీవీ వి ఎన్ రావు, ఎన్ ఎఫ్ ఐ ఆర్ వర్కింగ్ మెంబర్ సిర్ల రాజశేఖర్, రైల్వే యూనియన్ నాయకులు రవి చౌదరి, దువ్వాడ విక్రమ్ రామారావు , భాస్కరరావు, ఆర్ భీమారావు, తాతారావు కోచ్ లు జగదీష్, గోపి, జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ కార్యదర్శిమూల మల్లికార్జున్ రావు, గ్రీన్‌ఆర్మీ సభ్యులు లక్ష్మీనారాయణ, ఇచ్చాపురం క్రికెట్ అసోసియేషన్ మెంబర్స్ ఈశ్వరరావు, గణేష్, క్రీడాకారులు పాల్గొన్నారు.





## పలాస ఎయిర్పోర్ట్ అవగాహన సదస్సు కోసం స్థల పరిశీలన

**పలాస, అక్టోబరు1(వార్త):** కేంద్ర విమానయన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పలాస ఎయిర్పోర్ట్ అవగాహన సదస్సు కోసం ఈ నెల 5వ తేదీన పలాస వస్తున్నారు. ఈ నేపథ్యంలో టిడిపి శ్రేణులు రైల్వే ఇన్స్టిట్యూట్ వద్ద స్థలాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబూరావు, తెలుగుదేశం పార్టీ శ్రీకాకుళం జిల్లా ప్రధాన కార్యదర్శి విఠల్, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

## వంద రోజులలో పారిశుధ్యం మెరుగుకు స్వచ్ఛభారత్ మిషన్ చర్యలు

**పలాస, అక్టోబరు1(వార్త):** 100 రోజులలో పారిశుధ్యం మెరుగుకు స్వచ్ఛభారత్ మిషన్ చర్యలు తీసుకుంటామని పలాస మున్సిపల్ కమిషనర్ నడిపేన రామారావు స్పష్టం చేశారు. భారత ప్రభుత్వ గృహ నిర్మాణం, పట్టణాభివృద్ధి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో స్వచ్ఛభారత్ మిషన్ చొరవతో స్వచ్ఛ షహర్ జోడి నగరాలుగా అభివృద్ధి చేయడానికి గాను రాజమహేంద్రవరం మున్సిపల్ కార్పొరేషన్‌తో పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీకి మధ్య అవగాహన ఒప్పందం కుదిరిందన్నారు. ఈ ఒప్పందం ప్రకారం పట్టణంలో ఉన్నత స్థాయి పరిశుభ్రతను సాధించిన మెంటర్ సిటీ యొక్క అనుభవాలను అధిక స్థాయిలో స్వచ్ఛతతో, మెరుగుదల సాధించడానికి గాను మెంటర్ సిటి గా పిలవబడే రాజమహేంద్రవరం కార్పొరేషన్ వారు పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘంలో తమ యొక్క పూర్తి మద్దతుతో నిర్మాణాత్మకమైన సాంకేతిక బదిలీ, పారిశుధ్యం ఘన వ్యర్థాల నిర్వహణ, పబ్లిక్ స్థలాల్లో పరిశుభ్రత, పరిశుభ్రత పాటించడంలో ప్రజల భాగస్వామ్యం మొదలైన వాటిలో వ్యూహాత్మకమైన మద్దతుని ప్రోత్సహించడానికి భారత ప్రభుత్వం ఈ ప్రణాళికను రూపొందించడం జరిగిందని అన్నారు. ఈ ఒప్పందం వల్ల 100 రోజులలో కిందిస్థాయి మున్సిపాలిటీలో అనగా సేవలు పొందే పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘంలో పారిశుధ్యం మెరుగుపరచడమే లక్ష్యంగా నిర్ణయించడమైనదని, ఈ ఒప్పందం వల్ల పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘంలో పారిశుధ్యం మెరుగుకు ఉపయోగపడుతుందని కమిషనర్ తెలియజేశారు.

జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## మెట్లపై జారి గాయపడి రైతు మృతి

**జలుమూరు, అక్టోబరు1 (వార్త):** జలుమూరు మండలం తలతరియా గ్రామానికి చెందిన దండుపాటి గద్దయ్య (56) ప్రమాదవశాత్తు మృతిచెందాడు. వివరాల్లోకి వెళ్తే, గత నెల 16న సాయంత్రం 6 గంటల సమయంలో గద్దయ్య ఇంటి వరండాలో మెట్లు ఎక్కుతుండగా కాలుజారి పడి తలకు తీవ్ర గాయమైంది. తల వెనుక భాగంలో గాయం కావడంతో రక్తం గడ్డకట్టింది. మొదట స్థానిక ఆర్ఎంపీ వైద్యుడి వద్ద మందులు వేసుకున్నా ఫలితం లేకపోవడంతో, కుటుంబ సభ్యులు గద్దయ్యను సెప్టెంబర్ 18న శ్రీకాకుళం రిమ్స్ హాస్పిటల్‌లో చేర్పించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం విశాఖపట్నం కేజీహెచ్‌కు తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ సెప్టెంబర్ 30వ తేదీ రాత్రి 9.50 గంటల సమయంలో మృతిచెందాడు. ఈ ఘటనపై జలుమూరు ఎస్ఐ బి. అశోక్ బాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# రాష్ట్ర అభివృద్ధే కూటమి ప్రభుత్వ ధ్యేయం

*** ఎమ్మెల్యే మామిడి గోవిందరావు**

**మెళియాపుట్టి, అక్టోబరు1(వార్త):** కూటమి ప్రభుత్వంలో రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలశ్రేయస్సు, రాష్ట్ర అభివృద్ధి ధ్యేయంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిరంతరం పని చేస్తూ రాష్ట్రాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి జరిగేలా కృషి చేస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని స్థానిక శాసనసభ్యులు మామిడి గోవిందరావు అన్నారు. నియోజకవర్గ పరిధిలో గల మెళియాపుట్టి మండలం కోసమాల గ్రామంలో బుధవారం నాడు జరిగిన సూపర్ జీఎస్టీ - సూపర్ సేవింగ్స్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిఎస్టి 2.0 సంస్కరణల అమలుపై ప్రజలలో అవగాహన కల్పించాల్సివుందన్నారు. పేద, మధ్యతరగతి వర్గాలకు సూపర్ గిఫ్ట్ ను ఎన్డీఏ ప్రభుత్వం ఇచ్చిందని తెలియజేస్తూనే, రానున్న జిఎస్టి 2.0 ద్వారా రైతులకు 18 శాతంలో 5 తగ్గించి పనిముట్లు అందజేయనున్నట్లు తెలిపారు. అలాగే ప్రజాసేవలో పారదర్శకత అభివృద్ధిలో వేగం,ఈ రెండు లక్ష్యాల కోసమే ప్రభుత్వ ఈ సంస్కరణను తెచ్చిందని రైతులు, వ్యాపారవేత్తలు ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని తమ వ్యాపారాలను మరింత వ్యాప్తి చేసుకొని గ్రామలభివృద్ధికి తోడ్పడాలని పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వ పాలనలో ప్రజలకు అన్ని విధాలుగా మేలు చేస్తున్నారన్నారు. సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ కార్యక్రమంలో భాగంగా రైతులతో కలిసి ట్రాక్టర్ ర్యాలీ కార్యక్రమంలో పాల్గొన్నారు. అంతకుముందు గ్రామంలోనున్న మాజీ కేంద్రమంత్రి కింజరాపు ఎర్రంనాయుడు విగ్రహానికి పూలమాల వేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేతో పాటు ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.




## ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పేదలకు వరం



**పోలాకి/జలుమూరు, అక్టోబరు1(వార్త):** ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రతి నెల ఒకటో తేదీనే ఇంటి వద్దకే పింఛన్లు అందజేస్తున్నారని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి తెలిపారు. బుధవారం వనితమండలం గ్రామం, కుమ్మరి కాలనీలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో స్థానిక కూటమి నేతలతో కలసి ఇంటింటికి వెళ్లి లబ్ధిదారులకు పింఛన్లు స్వయంగా అందజేసారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఎన్టీఆర్ భరోసాతో నిరుపేదలకు, నిరాశ్రయులకు ఆర్థిక భరోసా చేకూరుతుందన్నారు. ఈ అవకాశాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని, లబ్ధిదారులు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాగానే పింఛను మూడు వేల నుండి నాలుగు వేలకు పెంపు చేయడం, పింఛన్లు ప్రతినెల మొదటి తారీకునే అందజేయడం పట్ల తమ సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారన్నారు. ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా ఒకటో తేదీనే పింఛన్లు పంపిణీకి అధిక ప్రాధాన్యతనిస్తోందన్నారు. మొదటి రోజునే నూరు శాతం పింఛన్ల పంపిణీకి కృషి చేయాలని సంబంధిత సచివాలయ సిబ్బందికి ఎమ్మెల్యే సూచించారు. ఎన్డీయే కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ వస్తోంది. ఈ క్రమంలోనే చంద్రబాబు ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఎటువంటి ఆలస్యం లేకుండా పెన్షన్లను ఇంటింటికీ వెళ్లి పంపిణీ చేయిస్తున్నట్లు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పోలాకి మండల పార్టీ అధ్యక్షులు మిరియాపల్లి వెంకటప్పలనాయుడు, పోలాకి పిఏసియస్ ఛైర్మన్ భైరి భాస్కరరావు, కురిటి ఈశ్వరరావు, ఎన్ని రమేష్, కాయ రవి, ధర్మాన అమ్మన్నాయుడు, తూలుగు దిలీప్, మురళి, దుంగ సీతారాం మరియు కూటమి నాయకులు, కార్యకర్తలు, సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కూటమి ప్రభుత్వంతోనే సంక్షేమం

**శ్రీకాకుళం, అక్టోబరు 1 (వార్త):** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వంతోనే సంక్షేమం సాధ్యమని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. రూరల్ మండలంలోని కిష్టప్ప పేట, గేదెలవానిపేట గ్రామాలలో బుధవారం పింఛన్ పంపిణీ



కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ పాలనలో ప్రజలు సుఖ సంతోషాలతో జీవిస్తున్నారని పేర్కొన్నారు. గతంలో పింఛను కోసం వృద్ధులు, వికలాంగులు, వితంతువులు అనేక ఇబ్బందులు పడేవారని వారి జీవితాల్లో సంతోషాన్ని నింపింది ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అని పేర్కొన్నారు. పింఛన్ పెంపుతో వృద్ధులకు, దివ్యాంగులకు, వితంతువులకు ఆసరా కలిగిందని ఆయన వివరించారు. అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందేలా అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి పనిచేస్తున్నారని చెప్పారు. భవిష్యత్తులో శ్రీకాకుళం నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే నెంబర్ వన్ నియోజకవర్గం గా అభివృద్ధి చేసి నిలుపుతానని ఈ సందర్భంగా శంకర్ హామీని ఇచ్చారు. అనంతరం గేదలవానిపేటలో ఏర్పాటు చేసిన దుర్గాదేవి మండపాన్ని ఆయన సందర్శించి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నియోజకవర్గంలోని ప్రజలందరికీ కష్టాలు తీర్చి వారి జీవితాల్లో సుఖసంతోషాలు నింపాలని అమ్మవారిని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించండి


**వీరఘట్టం, అక్టోబరు1 (వార్త):**ప్రస్తుతం ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ పాలకొండ నియోజక వర్గ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ దృష్టికి తీసుకువెళ్లారు ఎస్సీ ఎస్టీ టీచర్స్ ఫెడరేషన్ ప్రతినిధులు. బుధవారం మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ లో స్వయంగా కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. రాష్ట్రంలోని ఉపాధ్యాయ వర్గమునకు చెందిన సమస్యలను కూలం కుశముగా వివరిస్తూ వారు ఎమ్మెల్యేకు నివేదించారు. ముఖ్యంగా జీవో నెంబర్ 3 షెడ్యూల్డ్ ఏరియా నాన్ షెడ్యూల్డ్ ఏరియాకు సంబంధించిన, షెడ్యూల్ ఏరియా ప్రాంతంలో ఉన్నవారికి ఆ ప్రాంత షెడ్యూలు ఏరియాకు సంబంధించిన గిరిజనులనే ఉద్యోగ నియామకాలకు వర్తింప చేయాలని నాన్ షెడ్యూల్డ్ ఏరియాకు సంబంధించిన వారిని ఉద్యోగ నియామకాలకు వర్తింప చేయరాదని వారు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. అలాగే జీవో నెంబర్ 342 ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయులకు స్టడీ లీవ్ ను ఆయా విద్యా సంవత్సరంలోనే వారికి శిక్షణ అవకాశాలు కల్పించి వారి పదోన్నతిగా దోహదపడే విధంగా ఉన్నత అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. 2025-26, సంవత్సరానికి గాను 10వ తరగతి విద్యార్థులకు పబ్లిక్ పరీక్షలకు తెలుగు లేదా ఇంగ్లీష్ మీడియంలో వ్రాయడానికి సరైన ఆప్షన్ను ఎంపిక చేసుకునే వెసులుబాటు విద్యార్థులకు కల్పించాలన్నారు. 11వ పిఆర్సి బకాయిలు నాలుగు విడతల డిఏ బకాయిలు విడుదల చేయాలని, జిపిఎఫ్ పీ ఫ్ సరెండర్లీవ్ వుకు సంబంధించిన నిధులను తక్షణమే విడుదల చేయాలని వారు కోరారు. అదేవిధంగా 12వ పిఆర్సిని ప్రకటించి ఐఆర్‌ని ఉద్యోగుల మనోబిష్టానికి అనుగుణంగా ప్రకటించాలని, ఎస్సీ ఎస్టీ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శి ఎం డి సత్యనారాయణ రెడ్డి, అన్ను వెంకట్రావులు కోరారు. వీరితో పాటుగా మన్యం జిల్లా ప్రధాన కార్యదర్శి వన్నల శ్యామసుందర్రావు, మండల అధ్యక్షులు గునాన దుర్గాప్రసాద్ తదితరులు ఉన్నారు.

## అంబేద్కర్ విగ్రహాన్ని పునః ప్రతిష్టించండి

**వీరఘట్టం, అక్టోబరు 1 (వార్త):**ఇటీవల జరిగిన రోడ్లు విస్తరణలో భాగంగా అంబేద్కర్ విగ్రహాన్ని తొలగించారని, అయితే దాన్ని యధావిధిగా పునః ప్రతిష్టించాలని దళిత సంఘ నాయకులు ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణకు విన్నవించారు దళిత వర్గానికి చెందిన ప్రజలు ఎప్పుడూ ఎల్లప్పుడూ మీకు తోడుగా, అండగానే ఉంటారని వారు అన్నారు. దీనిపై ఎమ్మెల్యే స్పందిస్తూ తాను యధాస్థానంలో అంబేద్కర్ విగ్రహాన్ని పునః ప్రతిష్టించేందుకు చర్యలు చేపడతానని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు ఉదయాన ఉదయ భాస్కర్ ,టిడిపి పట్టణ శాఖ అధ్యక్షులు జామి లక్ష్మీనారాయణ, జంపు శేఖర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో దళిత నాయకులు, అన్ను వెంకటరావు, పత్రి అనిల్, రావాడ ప్రసాద్, దర్రు సుందర్రావు, నివర్తి శశి, దూసి సాంబ, గునాన పోలిరాజు, గునాన దుర్గాప్రసాద్, వన్నల శ్యామసుందర్రావు, పక్కి పుష్పనాధం, దూసి రాజు, గునాన దిలీప్, యజ్జల సురేష్ తదితరులు పాల్గొన్నారు

## అధికార వికేంద్రీకరణ ద్వారానే
# స్థానిక సంస్థలు బలోపేతం

**కోటబొమ్మాళి, అక్టోబర్ 1(వార్త):** అధికార వికేంద్రీకరణ ద్వారానే స్థానిక సంస్థలు మరింత బలోపేతం అవుతాయని టిడిపి రాష్ట్ర కార్యదర్శి, టిడిపి కళింగ సాధికారిక రాష్ట్ర కన్వీనర్ బోయిన గోవిందరాజులు అన్నారు. బుధవారం తన స్వగృహం కోటబొమ్మాళిలో విలేకర్లుతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో సమితులు, జిల్లా పరిషత్ పాలన బలంగా ఉండేవని, సర్పంచ్ తీర్మాణం చేసి గ్రామానికి కావాల్సిన అన్ని అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయన్నారు.



ప్రజాస్వామ్యంలో స్థానిక సంస్థల ప్రతినిధులకు సరైన అధికారం ఉంటే ప్రజా సేవ చేసేందుకు అభివృద్ధికి అవకాశం ఉంటుందన్నారు. నా రాజకీయ ప్రస్థానం 21 ఏట నుంచి ప్రారంభమైందన్నారు. కార్పోరేట్ సభ్యులుగా, సుమారు 24 సంవత్సరాలు పాటు మేజరు పంచాయతీ కోటబొమ్మాళి సర్పంచ్‌గా నాకుటుంబసభ్యులు నిర్వహించటం జరిగిందన్నారు. కూటమి ప్రభుత్వంలో పెద్దలు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాన్, సీనియర్ మంత్రి అచ్చెన్నాయుడు దీనిపై చర్చ జరపాలన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో మూడంచెల విధానం అమల వుతుందన్నారు. ఈ విధానాల్లో ప్రజాప్రతినిధులకు సరైన అధికారాలు ఇవ్వాలని ఆయన కోరారు. దేశంలో కొన్ని రాష్ట్రాలలో స్థానిక సంస్థలు భలంగా ఉన్నాయని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. స్వర్గీయ నందమూరి తారక రామారావు 1982లో తెలుగుదేశం పార్టీ స్థాపించి 9 నెలల్లోనే అధికారంలోకి వచ్చారన్నారు. యువతకు ప్రాధాన్యం ఇవ్వడం ద్వారా అనేక అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలు జరిగాయన్నారు. అదే ప్రభుత్వంలో మండలాల వ్యవస్థ ఏర్పడిందన్నారు.

# సంపద కేంద్రాలను వినియోగంలోకి తీసుకురావాలి

*** జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్**

**కవిటి/ఇచ్ఛాపురం, అక్టోబరు1(వార్త):** సంపద కేంద్రాలను వినియోగంలోకి తీసుకురావాలని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పంచాయతీ రాజ్ అధికారులను ఆదేశించారు. బుధవారం కవిటి మండలం బల్లిపుట్టుగ గ్రామంలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను ఇచ్ఛాపురం శాసన సభ్యులు, ప్రభుత్వ విప్ బెందాళం అశోక్‌తో కలిసి జిల్లా కలెక్టర్ పంపిణీ చేశారు. అనంతరం జిఎస్టీ తగ్గింపుపై వ్యవసాయ శాఖ చేపట్టిన ట్రాక్టర్స్ ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఇచ్ఛాపురం నియోజకవర్గ స్థాయి అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఇచ్ఛాపురం నియోజకవర్గంలోనున్న ఉద్దానం, ఆర్‌డబ్ల్యూస్ పథకాలను మెగా కంపెనీలో విలీనం చేసిన తర్వాత సమస్యలు ఉత్పన్నమౌతున్నాయని ప్రభుత్వ విప్, శాసన సభ్యులు బి.అశోక్ ఆధికారుల దృష్టికి తీసుకువచ్చారు. అధికారులు సమన్వయం లేకపోవటం ఇబ్బందికరంగా మారిందన్నారు. దానిపై కలెక్టర్ స్పందిస్తూ రోజువారి నీటిసరఫరా నివేదితను ఇవ్వాల్సింది అధికారులే కదా అంటూ ప్రశ్నించారు. అందుకు శంకరబాబు, డిఈఈలూ గోపాలక్రిష్ణ, ఆశాలతలు నియోజకవర్గంలో పథకాలు, జలజీవని మిషన్ పనుల వివరాలను తెలియజేయగా. సంతృప్తి చెందని కలెక్టర్ రెండు వారాల్లో పనులు సక్రమంగా జరిగి నీటి సరఫరా మెరుగుపడాలని లేకుంటే చర్యలు తప్పవన్నారు. పంచాయతీరాజ్ శాఖ పనులపై సమీక్షించారు. పలాస నుంచి ఇచ్ఛాపురం వరకున్న మండలాల్లో పారిశుద్ధ్యం మెరుగుపడాల్సి ఉందన్నారు. తాను కవిటి వచ్చినప్పుడు సోంపేటలో కాలువలు పరిస్థితి చూసానని అద్వాన్నంగా ఉన్నట్లు చెప్పారు. . నెలలో రెండు వారాలు పారిశుద్ధ్యం మెరుగ పర్చితే చాలని ఎంతో మార్పు కనిపిస్తుందన్నారు. చెత్తసంపద కేంద్రాలును వినియోగంలోకి తీసుకురావాలని అలా చేయకుంటే సిబ్బందిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. కవిటి మండలంలో రీసర్వే తర్వాత జిరాయితీ భూములు ప్రభుత్వ ఖాతాల్లో చూపిస్తున్నాయని, దీని వలన రైతులు ఇబ్బంది పడుతున్నట్లు కలెక్టర్ కు వివరించారు. ఈ సమస్యపై ఆయా మండలాల్లో ఎంత వరకు రికార్డులు సిద్ధం చేసారని తహసిల్దార్లు ను కలెక్టర్ ప్రశ్నించారు. ఉన్నతాదికారుల ఆదేశాలు లేవని తహసిల్దార్లు చెప్పగా గ్రామ స్థాయిలో చేయాల్సిన బాధ్యత మీదే కదా అంటూ కలెక్టర్ చెప్పారు. ఈ సమీక్ష సమావేశంలో డుమా పిడి సుదాకర్, పలాస ఆర్డిఓ జి. వెంకటేష్, నియోజకవర్గంలోని అన్ని మండలాల తహసీల్దార్లు, ఎంపిడిఓలు, తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు రేషన్ డిపో ప్రారంభించి, బోరుకు శంకుస్థాపన చేశారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ఉన్న కిడ్నీ వ్యాధిగ్రస్తులను సందర్శించి వారి బాగోగులు, సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546